క్లుప్తంగా

ప్రమాదాల నివారణపై దృష్టి

కర్నూలు(రాజ్‌విహార్): బస్సు ప్రమాదాల నివారణపై దృష్టి పెట్టాలని రోడ్డు రవాణా సంస్థ కర్నూలు–2 డిపో మేనేజరు సర్దార్ హుసేన్ అన్నారు. సోమవారం ఆయన డ్రైవర్లకు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్యారేజీలో బస్సుల మరమ్మతులు, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చడమే లక్ష్యంగా బస్సులు నడపాలని సూచించారు. వివిధ కారణాలతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని, ఇలాంటి పరిస్థితులను ముందుగానే గుర్తించాలన్నారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ పెట్టింది పేరని, దీనిని అనుగుణంగా పనిచేసి ప్రమాద రహిత డ్రైవర్లుగా పేరు తెచ్చుకోవాలని సూచించారు. .

చిన్నారులతో పనులు చేయిస్తే చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): చిన్నారులు, బడి ఈడు పిల్లలతో పనులు చేయిస్తే చర్యలు తప్పవని కార్మిక శాఖ కర్నూలు సహాయ అధికారి కేశన్న అన్నారు. సోమవారం స్థానిక ధర్మపేటలోని తమ కార్యాలయంలో కింది స్థాయి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని చెప్పారు. ఈ నేపథ్యంలో పిల్లల హక్కులు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ముఖ్యంగా వారికి పనులకు పంపకుండా స్కూలుకు సక్రమంగా పంపేలా చూడాలని, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణాపై దృష్టి పెట్టాలన్నారు.

వైభవంగా మహానందీశ్వరుడి పల్లకోత్సవం

మహానంది: మహానందిలో కొలువైన శ్రీకామేశ్వరీదేవి సహిత శ్రీమహానందీశ్వరస్వామివారికి సోమవారం రాత్రి పల్లకీ ఉత్సవం మహావైభవంగా జరిగింది. ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు రవిశంకర అవధాని, అర్చకులు స్వామిఅమ్మవార్లను వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ, హారతులు చేపట్టి అనంతరం నాలుగుదిక్కుల్లో బలిహరణ పూజలు జరిపారు. ఆలయ ప్రాకారంలో స్వామిఅమ్మవార్ల పల్లకీ ఉత్సవం కనుల పండువగా జరిగింది.

నేడు హుండీ కానుకల లెక్కింపు

మహానంది : మహానంది ఆలయంలో మంగళవారం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం వుంటుందని ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి సోమవారం తెలిపారు. శ్రీకామేశ్వరీ , మహానందీశ్వరస్వామివార్ల ఆలయాలతో పాటు కోదండ రామాలయం, ఆంజనేయ స్వామి ఆలయం , అన్నదాన విభాగం కేంద్రాల్లోని హుండీ కానుకలను లెక్కిస్తామన్నారు. ఆలయ సిబ్బంది ప్రతి ఒక్కరు హాజరుకావాలని సూచించారు.

పాలస్తీనాపై దాడులను ఆపాలి



నిరసన తెలుపుతున్న నాయకులు

కర్నూలు(సెంట్రల్): ప్రపంచ శాంతి కోసం తక్షణమే పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులను నిలుపుదల చేయాలని ఎస్‌డీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు జహంగీర్ అహ్మద్ విన్నవించారు. సోమవారం ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న దాడులను ఖండిస్తూ కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తక్షణమే ఐక్యరాజ్య సమితి కలుగజేసుకుని రెండు దేశాల మధ్య శాంతిని స్థాపించాలన్నారు. పాలస్తీనాలోని శరణార్థులను ఆదుకోవడానికి ప్రపంచ దేశాలు విరివిగా ఆర్థిక సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఖలీల్ అహ్మద్,అమీర్ మావియా, అశ్వాక్‌హుస్సేన్,చాంద్‌బాషా, వకీల్ అహ్మద్, పాల్గొన్నారు.

శ్రీశైలంలో గోశాల నిర్వహణపై ప్రశంసలు

శ్రీశైలం: శ్రీశైలదేవస్థానం ఆధ్వర్యంలో మల్లమ్మ కన్నీరు ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన గో సంరక్షణశాల నిర్వహణపై అఖిల భారత గో సేవా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు హైదరాబాద్ బాలకృష్ణ గురుస్వామి ప్రశంసలు కురిపించారు. సోమవారం ఈఓ పెద్దిరాజుతో కలిసి గోశాలను సందర్శించారు. గోశాలలో దేవస్థానం గో సంరక్షణ కు తీసుకుంటున్న చర్యలపై ఈఓను అడిగి తెలుసుకున్నారు. గోవులకు వేస్తున్న గడ్డి, దాణా, కాలానుగుణంగా వేస్తున్న టీకా మందుల వివరాలను, ఇతర వైద్య సేవలను ఈఓ ఆయనకు వివరించారు. అలాగే గోమయం ద్వారా తయారు చేస్తున్న విభూతి, గో ఆర్క్, ధూప్ స్టిక్స్, యాంటీరేడియేషన్ స్టిక్కర్స్, హోమ పిడకలు తదితర గో ఉత్పత్తులను తయారు చేసి ప్రత్యేక కౌంటర్ ద్వారా భక్తులకు విక్రయిస్తున్నామని తెలియజేశారు. దీనిపై జరిగిన ఆయన శ్రీశైలదేవస్థానం వారు గో సంరక్షణశాలను ఎంతో ప్రణాళిక బద్ధంగా నిర్వహిస్తున్నారని సంతృప్తిని వ్యక్తం చేశారు. అఖిల భారత గో సేవా ఫౌండేషన్ తరఫున శ్రీశైలం గోశాల నిర్వహణకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో గో సంరక్షణ విభాగ పర్యవేక్షకులు శ్రీనివాసులు , గోశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశే లక్ష్యం

- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి
- ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


వైద్య శిబిరంలో కంటి పరీక్షలను పరిశీలిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 28వ వార్డులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. వైద్య శిబిరంలో ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాళ్లను, అందిస్తున్న సేవల గురించి శిబిరానికి వచ్చిన వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం ఉచితంగా అందిస్తున్నామన్నారు. శిబిరంలో మలేరియా, డెంగీ, మధుమేహం, బీపీ, గళ్ల, కంటి, హిమోగ్లోబిన్ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇస్తున్నారని చెప్పారు. ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నారాయణరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నాయకులు సత్యంరెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, బాబు, శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్ష పేదలకు వరం

కర్నూలు(హాస్పిటల్): జగనన్న ఆరోగ్య సుర్క్ష వైద్య శిబిరాలు పేదలకు వరం లాంటివని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. సోమవారం ఆయన స్థానిక ఇల్లూరునగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని సీతారామనగర్‌లో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని తనిఖీ చేశారు. వైద్యశిబిరంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్, కేస్‌షీట్, ల్యాబ్ పరీక్ష, మెడికల్ ఆఫీసర్ కౌంటర్లు, మందులు ఇచ్చే కౌంటర్లు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణ వ్యాధులన్నింటికీ ఇక్కడే చికిత్స చేస్తారని, అవసరమైన వారికి ఉన్నత వైద్యం కోసం రెఫరల్ ఆసుపత్రులకు పంపిస్తారన్నారు.

ఉస్మానియా కళాశాలలో తనిఖీ

స్థానిక వడ్డేగేరి యూపీహెచ్‌సీ పరిధిలోని ఉస్మానియా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారిణి హేమలత పరిశీలించారు. పిల్లలు, యుక్త వయస్సు ఆడపిల్లలు, గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ హకీమ్ రషీద్, డాక్టర్ అబ్దుల్ అలీమ్ తదితరులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

అర్జీదారులు సంతృప్తి చెందేలా పరిష్కారం

- నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ
- స్పందనలో అర్జీల స్వీకరణ


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ భార్గవతేజ

కర్నూలు (న్యూటౌన్): అర్జీదారులు సంతృప్తి చెందేలా వారి సమస్యలను పరిష్కరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ తేజ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక నగర పాలక కౌన్సిల్ హాలులో జగనన్నకు చెబుదాం – స్పందన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. అయితే, అర్జీలు రీ ఓపెన్ కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్పందనలో నగర పాలక మేనేజర్ చిన్నరాముడు, సూపరింటెండెంట్ ఇంజినీర్ వేణుగోపాల్, డిప్యూటీ సిటీ ప్లానర్ మోహన్‌కుమార్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సమస్యలివే...

- తమ ఏరియాలోని పార్కులో వాకింగ్ ట్రాక్, ప్రహరీగోడ, సిట్టింగ్ బెంచీలు ఏర్పాటు చేయాలని మారుతీనగర్‌కు చెందిన పుల్లారెడ్డి, చాంద్‌హుస్సేన్ విన్నవించారు.
- తమ ఏరియాలో ఏర్పాటు చేసిన సెల్‌టవర్‌ను తొలగించాలని ముథిరాజ్‌నగర్‌కు చెందిన కాలనీవాసులు వినతిపత్రం ఇచ్చారు.
- అశోక్ నగర్‌లో నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నట్లు ఆ ఏరియా వాసులు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.
- తమకు మంజూరైన టిడ్కో ఇళ్లను కేటాయించాలని పింజరివీధికి చెందిన షబాన అభ్యర్థించారు.
- తమ ఏరియాలో పార్కు, డ్రైనేజీ వ్యవస్థలను అభివృద్ధి చేయాలని గీతానగర్ అసోసియేషన్‌కు చెందిన సభ్యులు కోరారు.
- తమ ఏరియాల్లో తాగునీటి సరఫరా సమయాన్ని పెంచాలని సోమిశెట్టినగర్‌కు చెందిన శ్రీనివాసులు అలాగే కల్లూరుకు చెందిన నాయకంటి మహేంద్ర వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు.
- వీధి కుక్కల బెడద తీవ్రంగా ఉందని వీనస్‌కాలనీకి చెందిన శరత్‌రావు ఫిర్యాదు చేశారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి

- నూతన పల్లెలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సుధాకర్


పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: ప్రజా సంక్షేమంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. కర్నూలు మండల పరిధిలోని నూతన పల్లె గ్రామంలో సోమవారం సీసీ రోడ్లు, కమ్యూనిటీ టాయిలెట్ల నిర్మాణాలకు ఆయన ఎంపీపీ డి.వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపట్టడం లేదని ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. అభివృద్ధి అంటే టీడీపీ నాయకులకు కార్యకర్తలకు దోచి పెట్టేది కాదని, పేద, బడుగు, బలహీన, మైనార్టీ వర్గాల జీవితాల్లో మార్పు తీసుకురావడమన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఆయా వర్గాలకు వివిధ పథకాల ద్వారా ప్రభుత్వ సాయం అందజేస్తుందన్నారు. రెండేళ్లు కరోనాతో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాలు నిలిపివేయలేదన్నారు. గ్రామాల్లో మారిన స్కూళ్లు, ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాల రూపు రేఖలు టీడీపీ నేతల కళ్లకు అగుపించడం లేదన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీలతో పాటు తాగు నీటి సదుపాయలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. రూ.10 లక్షలతో నూతనపల్లె వాగు నుంచి ఆంజనేయస్వామి గుడి వరకు సీసీ రోడ్డు వేస్తున్నామని, రూ.10 లక్షలతో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో మహిళలకు ఇచ్చిన మాట ప్రకారం కమ్యూనిటీ టాయిలెట్లు నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కృష్ణ, మండల కనీ్వనర్ మహబూబ్ బాషా, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు వాసు, హరినాథ్ రెడ్డి, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

అవీ-ఇవీ

మైనార్టీలు ఆర్థికంగా ఎదగాలి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని మైనార్టీలు ఆర్థికంగా ఎదగాలని ఆల్ మైనారిటీ వెల్ఫేర్ సంఘం కన్వీనర్ రోషన్ అలీ అన్నారు. సోమవారం స్థానిక సి.క్యాంప్ వద్ద ఉన్న ఆ సంఘం కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారన్నారు. అర్హులు ఆ పథకాలకు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని కోరారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపు ఆన్‌లైన్‌లో సులువు

కర్నూలు(రాజ్‌విహార్): ఆన్‌లైన్ ద్వారా నెలవారి విద్యుత్ బిల్లుల చెల్లింపు ఎంతో సులువు అని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీరు వై. సుబ్బన్న సోమవారం ఒక ప్రకనటలో తెలిపారు. కౌంటర్ల వద్ద గంటల సేపు క్యూలో ఉండి, తమ సమయాన్ని వృథా చేసుకోకుండా ఏపీఎస్‌పీడీసీఎల్ వెబ్‌సైట్, యాప్, ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి సురక్షిత యాప్‌ల ద్వారా బిల్లులు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

2న ఏపీ రైతు సంఘం సమావేశం

కర్నూలు(సెంట్రల్): ఏపీ రైతు సంఘం జిల్లా స్థాయి విస్తృత సమావేశం నవంబర్ 2వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి కె. జగన్నాథం సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ఏపీరైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, సీసీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య హాజరవుతారన్నారు. రాజమండ్రిలో జనవరి 5,6 తేదీల్లో జరిగే రాష్ట్ర మహాసభలు, డిసెంబర్ 2,3 తేదీల్లో ఎమ్మిగనూరులో జరిగే జిల్లా మహాసభల నిర్వహణపై చర్చించనున్నట్లు తెలిపారు.

సుంకేసులలో 0.531 టీఎంసీల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు నీటి విడుదల నిలిపివేసినట్లు సోమ వారం డ్యాం అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 0.531 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

మోదీ పాలనలో పేదలకు ఇబ్బందులు

- మోదీ పాలనలో అంబానీ, అదానీలకే మంచిరోజులు
- కర్నూలులో నిర్వహించిన బహిరంగ సభలో సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ దవాలే


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎంపొలిట్‌బ్యూరో సభ్యుడు అశోక్ దవాలే

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాలనలో పేదలు ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు అశోక్ దవాలే అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక అంబానీ, అదానీలకే మంచి రోజులు వచ్చాయని, వారి ఆస్తులు ఏడాదికేడాదికి రెట్టింపు అవుతూ పోతున్నాయని విమర్శించారు. ఆపార్టీ ఆధ్వర్యంలో అసమానతలు లేని అభివృద్ధి కోసం అంటూ చేపట్టిన ప్రజా రక్ష భేరీ బస్సుయాత్రను సోమవారం ఉదయం ఆదోనిలో ఆయనతో పాటు సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు,మాజీ ఎమ్మెల్యే గఫూర్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. సాయంత్రం ఆరు గంటలకు బస్సు యాత్ర కర్నూలు నగరానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో అంబేడ్కర్ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. అచ్ఛేదిన్ పేరుతో అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వంలో పేదలు కూడు, గూడు కోసం వెంపర్లాడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ అధికారంలోకి రాకముందు రూ.400 ఉన్న సిలిండర్ నేడు రూ.1100కు చేరుకుందన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్ పరం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి ప్రధాని యువతను మోసం చేశారన్నారు. అసమానతలు లేని అభివృద్ధి కోసం సీపీఎం చేపట్టిన బస్సు యాత్రను ప్రజలు ఆదరించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో సీపీఎంను బీజేపీకి ప్రత్యామ్నాయంగా ఎన్నుకుంటే రూ.400లకే గ్యాస్ సిలిండర్, రూ.60లకే పెట్రోల్, ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కును పరిరక్షిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ రాష్ట్ర నాయకులు పి.నిర్మల, కె.ప్రభాకరరెడ్డి పాల్గొన్నారు.

1,2 తేదీల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం

కర్నూలు (న్యూసిటీ) : వచ్చే నెల ఒకటి, రెండో తేదీల్లో మంచినీటి సరఫరాకు అంతరాయం ఉంటుందని నగర పాలక కమిషనర్ భార్గవతేజ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక బళ్లారి చౌరస్తా సమీపంలోని ఇంటర్‌నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద 300 ఎంఎం డయా ఏసీ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. దీంతో నగరంలోని ఎన్టీఆర్ కాలనీ, వీకర్‌సెక్షన్ కాలనీ, రమణ బంకు లైన్, విష్ణు టౌన్‌షిప్, ఎల్కూరు ఎస్టేట్, వసుంధర అపార్ట్‌మెంట్, ప్రియా హోమ్స్, వెంగేశ్వర నగర్, నాగేంద్ర నగర్, పరిమళ నగర్, కృష్ణారెడ్డి నగర్, గణేష్ నగర్, నిర్మల్ నగర్, బృందవన నగర్, అయ్యన్న నగర్, రామలింగేశ్వర నగర్, బాబా బృందవన నగర్, రాజీవ్ నగర్, వీనస్ కాలనీ, ఆటో నగర్‌లలో రెండు రోజులపాటు మంచినీటి సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నగర ప్రజలు నీటిని పొదుపుగా వాడుకొని నగరపాలక సంస్థకు సహకరించాలని కోరారు.

ముగిసిన మేరీమాత మాసోత్సవాలు

ఓర్వకల్లు : సకల జనుల మాతగా పిలువబడుతున్న మండల కేంద్రంలో వెలసిన మేరీమాత క్రైస్తవుల దివ్య మాతగా ప్రసిద్ధిగాంచింది. ఓర్వకల్లులో సకల జనుల మాత మాసోత్సవాలు సోమవారం ఘనంగా ముగిశాయి. స్థానిక ఆర్‌సీఎం సంఘస్తుల ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహించిన ఇంటింటి జపమాల మాసోత్సవాలకు కర్నూలు మేత్రాసన పరిపాలనాధికారి రెవ.మోన్సిగ్నోర్ ఎ.చౌరప్ప, రెవ.ఫా జోజిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాయంత్రం 7 గంటలకు స్థానిక విచారణ గురువులు రెవ.ఫా.ఆనందరాజు ఆధ్వర్యంలో అమ్మవారి స్వరూపానికి ఊరేగింపు నిర్వహించారు. స్థానిక బాలయేసు దేవాలయం (పాత చర్చి) నుంచి కొత్త చర్చి వరకు క్రైస్తవ యువతీ యువకులు కొవ్వొత్తులు చేతపట్టి శాంతియుత ప్రదర్శన చేపట్టారు. అనంతరం పలువురు విచారణ గురువులు వ్యాఖ్యోపదేశం చేశారు. దివ్యబలి పూజ అనంతరం బైబిల్ సందేశాలను వినిపించారు. అనంతరం భక్తులకు విందు భోజనం ఏర్పాటు చేశారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరం

కర్నూలు (న్యూసిటీ) : మహిళలకు వెంటాడుతున్న రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన అవసరమని రాయలసీమ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎ.ఆనందరావు అన్నారు. ఆ వర్సిటీలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రొమ్ము క్యాన్సర్ అవగాహన మాసోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలను ముందే గుర్తించి పరిష్కరించుకోవాలని చెప్పారు. దైనందిన జీవితంలో మారిన ఆహార అలవాట్లతో చిన్న వయస్సు వారు సైతం క్యాన్సర్ బారిన పడుతున్నారని తెలిపారు. మహిళలు ఆకుకూరలు, పోషకాలు ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, రోజూ వ్యాయామం చేయాలని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ సీవీ కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ సుందరానంద పుచ్చ, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ గంధం అరుణ, డాక్టర్ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు

కర్నూలు (న్యూసిటీ): బాలికలు, మహిళలు బాగా చదువుకుని అన్ని రంగాల్లో రాణించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు కాకర్ల శాంతికుమార్, ఊట్ల రమేష్ బాబు కోరారు. సోమవారం కర్నూలు ఓల్డ్‌టౌన్ 5వ వార్డు నాగులకట్ట దగ్గర పౌరహక్కుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ 1955 చట్ట ప్రకారం ప్రతి నెల 30, 31వ తేదీల్లో జిల్లా, మండల కేంద్రాల్లో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించుకోవాలన్నారు. సమాజంలో హెచ్చు తగ్గులు, అసమానతలు తొలగించడమే సివిల్ రైట్ డే ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో వీఆర్వో, మహిళ పోలీసులు, పొదుపు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నామంటూ..

సహచరుడి కుటుంబానికి చేయూత


లాలుషావలి సతీమణికి నగదును అందిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు(అర్బన్): అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ కుటుంబానికి ఆయన బ్యాచ్ (1998)కు చెందిన సహచర కానిస్టేబుళ్లు నగదును అందించి మానవత్వం చాటుకున్నారు. జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వుడులో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న లాలుషావలి (ఏఆర్ పీసీ 1723) ఈ ఏడాది అక్టోబర్ 9వ తేదీన అనారోగ్యంతో మృతి చెందారు. తమ సహచరుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించేందుకు 1998 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్లు తమ వంతు సహాయంగా రూ.1.10 లక్షల నగదును జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ చేతుల మీదుగా మృతుడి సతీమణి షాహినికి అందించారు. సోమవారం స్థానిక ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆర్ఐ వీఎస్ రమణ, 1998 బ్యాచ్ పోలీసులు, లాలుషావలి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు

కష్టకాలంలో ఆపన్నహస్తం


బాధిత కుటుంబసభ్యులకు నగదు అందజేస్తున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది

కర్నూలు (న్యూసిటీ) : నాలుగు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నంద్యాల అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్‌మాన్ పి.సంజీవరాయుడు కుటుంబానికి ఆ శాఖ ఉద్యోగులు అండగా నిలబడ్డారు. రూ. 5,37,016 సేకరించి సోమవారం సంజీవరాయుడు తల్లిదండ్రులు, భార్య పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాలుగో జోన్ రీజినల్ ఫైర్ ఆఫీసర్ ఎం.భూపాల్ రెడ్డి, రాష్ట్ర అసోసియేషన్ ఆర్గనైజేషన్ కార్యదర్శి శివరామిరెడ్డి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.మహేశ్వర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.ప్రతాప్, జిల్లా మాజీ అధ్యక్షుడు రామాంజనేయులు, ట్రెజరర్ సోము నాయక్, అనంతపురం జిల్లా కార్యదర్శి అవినాష్, కర్నూలు లీడింగ్ ఫైర్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రైం కార్నర్

అదుపు తప్పి కారు బోల్తా

కోడుమూరు రూరల్: హైదరాబాద్ నుంచి ఆదోని వైపు వెళ్తున్న కారు కోడుమూరు సమీపంలో సోమవారం అడ్డుగా వచ్చిన బైక్‌ను తప్పించబోయి అదుపు తప్పి పక్కనున్న పొలాల్లో బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న హైదరాబాద్‌కు చెందిన అక్షయజైన్, రాముతో పాటు, మరో ఇద్దరికి గాయాలయ్యాయి. కోడుమూరు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని వ్యక్తి మృతి

గూడూరు : మునుగాల గ్రామానికి చెందిన బి.నాయుడు(27) ఆదివారం రాత్రి పట్టణ సమీపంలో డంప్ యార్డు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ విక్టరిబాబు సోమవారం తెలిపారు. గూడూరులోని అతని బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. మృతుడి భార్య పుష్పావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

సారా విక్రేత అరెస్ట్

గడివేముల: మండల పరిధిలోని ఎల్‌కేతండా గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ బీటీ వెంకటసుబ్బయ్య సోమవారం తెలిపారు. గ్రామానికి చెందిన ఇస్లావత్ సుభాష్ నాయక్ నాటు సారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో 20 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి

ఆదోనిఅర్బన్: మండలంలోని జి.హొసళ్లి గ్రామానికి చెందిన చెన్నయ్య కుమారుడు అరవింద్ (4) అనే బాలుడు సోమవారం రాత్రి విద్యుదాఘాతానికి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతిచెందాడని నిర్ధారించారు. దీంతో బంధువులు కేసు వద్దని, బాలుడి మృతదేహాన్ని ఇంటికి తీసుకెళ్లారు. అయితే బాలుడు ఇంట్లో కిందికి వేలాడుతున్న విద్యుత్ తీగను పట్టుకోవడంతో ప్రమాదం చోటు చేసుకుందని గ్రామస్తులు తెలిపారు.


స్పోర్ట్స్

కరాటే పోటీల పోస్టర్ల ఆవిష్కరణ


ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మేయర్ రామయ్య

కల్లూరు: కర్నూలు నగరంలో డిసెంబర్ 3న నిర్వహించే దక్షిణాది రాష్ట్రాల ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించిన పోస్టర్లను నగర మేయర్ బీవై రామయ్య సోమవారం ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ క్రీడలతో మానసికోల్లాసం, కరాటే వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. పోటీలు కర్నూలు నగరంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో జరుగుతాయని ఏ.బి. కరాటే అకాడమీ అధినేత జె.ఫయాజ్ తెలిపారు. అన్ని కేటగిరీల క్రీడాకారులు పాల్గొవచ్చున్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఫోన్ నెం 88858 71795 సంప్రదించవచ్చన్నారు.

ఫుట్‌బాల్ పోటీలకు 'రిడ్జ్' విద్యార్థి


ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

కర్నూలు (న్యూటౌన్): వచ్చే నెల 4న ఎమ్మిగనూరు పట్టణంలో నిర్వహించే 65వ రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్–14 బాలికల విభాగం పోటీలకు రిడ్జ్ పాఠశాలకు చెందిన హాసిని ఎంపికైంది. ఆ విద్యార్థినిని సోమవారం పాఠశాల ప్రాంగణంలో అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల సీఈఓ గోపీనాథ్ మాట్లాడుతూ తమ పాఠశాలలో పిల్లల చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు.

2న ఎస్‌జీఎఫ్ పోటీలు

కర్నూలు (న్యూటౌన్): ఈ నెల 2వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంతర్ జిల్లా స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి. లక్ష్మయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షూటింగ్ బాల్, సాఫ్ట్ టెన్నిస్, స్క్వాష్ మార్షల్ ఆర్ట్స్, సిలంబం రోల్‌బాల్ వంటి క్రీడాంశాల్లో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

జాతీయ పోటీలకు శ్రీలక్ష్మి విద్యార్థి


విద్యార్థినితో పాఠశాల యాజమాన్యం

కర్నూలు (న్యూటౌన్): సంసిద్ శ్రీలక్ష్మి ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి కేతన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26 నుంచి 29 వరకు నెల్లూరు జిల్లాలోని అదాని వరల్డ్ పాఠశాలలో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. హైజంప్ విభాగంలో 165 సెంటీమీటర్లు జంప్ చేసి మొదటి స్థానంలో నిలిచారు. దీంతో సోమవారం పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినిని ప్రధానోపాధ్యాయురాలు సుశీల,పీఈటీ మాస్టర్ రాంబాబు అభినందించారు.

చదరంగంలో విద్యార్థి ప్రతిభ

పాణ్యం: మండలంలోని శాంతిరాం ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ చదువుతున్న విద్యార్థి హర్షిత జెఎన్‌టీయూ చదరంగం టీంకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ నెల 28న నెల్లూరు జిల్లా కావలిలో జరిగిన జెఎన్‌టీయూ అంతరాష్ట్ర చదరంగం ఎంపిక పోటీల్లో ప్రతిభ చూపడంతో హర్షిత ఎంపికై oదన్నారు. నవంబర్‌లో తమిళనాడులో జరిగే అంతరాష్ట్ర చదరంగం పోటీల్లో పాల్గొటుందన్నారు. హర్షితను కళాశాల ఎండీ శివరాం, హెచ్ఓడీ మల్లికార్జునరావు, పీడీ చంద్రారెడ్డి అభినందించారు.